విజయావారి
"పాతాళభైరవి"

వాయాగంధి, స్వప్నసుందరి, మంగళ, చంద్రవంక, తిలోత్తమ, ఆకాశరాజు, మొదలైన జానపద చిత్రాలు దెబ్బతిన్న అనంతరం విడుదల అయిన విజయావారి "పాతాళభైరవి" జానపదచిత్రమై ఉండికూడా బాగా నడుస్తున్నది. "పేరులోన నేమి పెన్నిధి యున్నది?" జానపదమైనా, సాంఘికమైనా, ఆఖరుకు పౌరాణికమైనా, అందులో ప్రసిద్ధనామాలుగల తారలున్నా, లేకున్నా జనాన్ని ఆకర్షించినది చిత్రం. చిత్రంలో నిజమైన ఆకర్షణ ఉంటే జనం చూస్తారు, హర్షిస్తారు. చిత్రంలోని సీవాళ్లవి మట్టి బుర్రలూ, మట్టిచేతులూ కాకుండా ఉంటే చిత్రంలో ఆకర్షణ ఉంటుంది. "పాతాళభైరవి" తెలివితేటలుగా తీసిన చిత్రం. అందులో ఆకర్షణ ఉన్నది అందుకే దానికి విజయం చేకూరుతున్నది.

"పాతాళభైరవి" లో మొదటి ఆకర్షణ ఏమిటంటే అది పిల్లల పత్రికలో సీరియల్ గా వెలువడి ఆబాలగోపాలాన్నీ రంజింపజేయగల కథ. ప్రపంచమంతటా ప్రచారమైన అల్లాఉద్దీన్ లాంతరు కథ దీనికి ఆధారం. మాంత్రికుడొకడు ధైర్యసాహసాలుగల యువకుడి సహాయంతో అపూర్వ శక్తిని హస్తగతం చేసుకోగోరి ఆఖరుకు ఆ శక్తిని ఆ యువకుడికే కోల్పోతాడు. ఆ ధైర్యసాహసాలుగల యువకుడు తన దారిద్ర్యాన్ని కోల్పోయి రాజకుమార్తెను కూడా వివాహమాడతాడు. ఈ అరబ్బీ దేశపు పిల్లలకథ పింగళివారిచేతిలో పడి పునర్జన్మ పొందింది. వీధిలో గొట్టికాయ లాడుకునే అల్లాఉద్దీన్ తోటరాముడైనాడు, మాంత్రికుడు నేపాళీమాంత్రికుడైనాడు. పింగళివారి పోషణలో ఈ పాత్రలు మూడింతలు పెరిగాయి. అంతేగాక మాంత్రికుడికి తోక కుక్కలాటి శిష్యుడూ, నాయకుడికి తోక లాటిస్నేహితుడూ ఏర్పడ్డారు. రాజుగారికి తోక శకారుడు, మేకపోతులాటివాడు, ఏర్పాటయాడు. మాంత్రికుడు కథలో ప్రవేశించకపూర్వమే తోటరాముడి సాహసాలూ, ప్రణయమూ, రాజుగారి బావమరిది కుప్పిగంతులూ కొంత వినోదం కలిగిస్తాయి.

ఈ ఇతివృత్తానికి కావలిసిన వాతావరణాన్ని గోఖలే కళాసృష్టి సమకూర్చింది. మంత్రాలమర్రి, జొడ్డుకేవరా, భూగర్భం

(48-వ పేజీ చూడుడు)



రాజరాజేశ్వరీవారి "సౌదామిని" లో

సి. ఎస్. ఆర్., రజని

పాతాళభైరవి

(24-వ పేజీ తరువాయి)

లోని భయంకరమార్గాలు, మొసలిమడుగూ, పాతాళభైరవి ఆలయమూ, బ్రహ్మాండమైన విగ్రహమూ, రాజప్రాసాదాలూ, పుష్పోద్యానవనా, మకరతోరణమూ, మాయామహలూ పర్వతశ్రేణులూ తయారయాయి.

చిత్రం మొదటినుంచి చివరిదాకా సీనిక్ రైల్వే ప్రయాణంలాగా ఒక్క క్షణంకూడా నీరసంలో పడకుండా సాగి పోతుంది. ప్రతిపాత్రా, ప్రతిసన్నివేశమూ, ప్రతిసంభాషణా, దుస్తులూ, వాతావరణమూ— సమస్తమూ ఇంకోయుగంనాటి వాతావరణాన్ని సూచిస్తాయి గాని వర్తమానాన్ని జ్ఞప్తికి రానివ్వవు. చిత్రం చెవులకూ కన్నులకూ సమంగా పని కల్పిస్తుంది. ఇందులో వినేదెంత ఉన్నదో, చూసేదీ అంత ఉన్నది. ఒకటికి రెండుసార్లు చూసినా గిట్టింపు అయే విషయాలున్న కొద్ది చిత్రాలలో "పాతాళభైరవి" ఒకటి.

చిత్రంలో ప్రధానాంశం పరాక్రమం— తోటరాముడి పరాక్రమం. ఈ చిత్రంలో కథావస్తువు చేయబడిన పరాక్రమం కేవలం వ్యక్తి ప్రాధాన్యత కలది కాదు— సాంఘిక ప్రయోజనం కలది. తోటరాముడు మొదట్లోనే ప్రజాశత్రువైన రాజుగారి బావమరిదిని తంతాడు. ఆపైన రాజుగారి ఎదట తలవంచ నిరాకరిస్తాడు. మీదుమిక్కిలి రాజకుమార్తెను ప్రేమించ సాహసిస్తాడు. ఈ నాటి పరిభాషలో తోటరాముడి పరాక్రమం సాంఘిక విప్లవ బీజాలతో కూడుకున్నది. అది మామూలు రాజకీయశక్తుల పరీక్షకు నిలబడిన అనంతరం అమానుషమాయాశక్తుల పరీక్షకు గురిఅవుతుంది. అదంతా జానపద కల్పన.

సాధారణంగా జానపదచిత్రాలలోకి మంత్రవిజాలితులనూ, మాంత్రికులనూ, మునీశ్వరులనూ తెచ్చి వారి ప్రభావంచేత కథలోకి చేరిన చిక్కులను ఇట్టే విప్పించటం చూస్తూఉంటాం. ఈ చిత్రంలో అది లేదు. ఆఖరుకు మాంత్రికుడూ తోటరాముడూ ఒకరినొకరు ఎదిరి నిలబడిన తరుణాన ఇద్దరి మాయాశక్తులూ ఎడంగా ఉంచబడ్డాయి. కనీసం ఇద్దరూ చెరొక కత్తి అయినా పట్టుకోరు. వారిద్దరిమధ్యా ఆధిక్యం నిర్ణయించేది కేవలం వారి శరీరబలాలే. జానపదచిత్రాలలో ఇది సాధారణ కథనం. ఆ కారణంచేత ప్రజలను మరింత ప్రబలంగా ఆకర్షించవచ్చు. అభిరుచి గలవారిని తప్పక మెప్పిస్తుంది.

చిత్రంలోని పాత్రలన్నిటిలోకీ బలమైన పాత్ర నేపాళమాంత్రికుడిది. మన కున్న జానపద సాహిత్యంలో ఈ నేపాళమాంత్రికుణ్ణి మించినపాత్ర మాయలఫకీరు ఒక్కడే ఉన్నాడు. మాయలఫకీరు కొత్త శక్తులకోసం బయలుదేరడు. వాడివద్ద అన్ని శక్తులూ అదివరకే ఉన్నాయి. వాణ్ణి భుజబలంతో ఎవరూ జయించలేరు. వాడిప్రాణం ఎక్కడో సప్తసముద్రాలవతల అనేకరక్షకుల మధ్య పంజరంలోని చిలుక కంఠంలో దాగి ఉన్నది. అందుచేతనే వాణ్ణి నిర్జించటానికి బాలవర్ధిరాజు గండభేరుండ పక్షులసహాయం పొందవలిసి వచ్చింది. వాటి పిల్లల్ని రక్షించటానికి చచ్చిబతకవలిసి వచ్చింది. నేపాళమాంత్రికుడు మాయలఫకీరుకన్న ఒకమెట్టు కింద ఉండటం అద్భుతరసానికి తరుగైనా పాత్రపోషణకిమాత్రం చాలా మెరుగయింది.

"పాతాళభైరవి" చిత్రంలోని మిగిలిన పాత్రల సృష్టిలో సమగ్రత అంతో ఇంతో లోపించిందని చెప్పవచ్చు. కథా పరిణామంపై ఆయాపాత్రల ప్రభావం తక్కువగా ఉండటమే దీనికి కారణం కావచ్చు. రాజూ రాజుకూతురూ, రాజుభార్యా, బావమరిదీ మొదలైనపాత్రలు వాతావరణంలో లీనమవుతున్నట్టుంటాయి గాని తమ వ్యక్తిత్వాన్ని గట్టిగా ప్రతిష్ఠించుకోవు. తోటమాలి రాముడూ, రాజు బావమరిది సీనూ కొంత నయం. రాజకుమార్తె పాత్ర బొత్తిగా చప్పగా చిత్రించబడింది.

నటనదృష్ట్యా చూసినా మాంత్రికుడి పాత్ర ధరించిన రంగారావు తన పాత్రను అతిసమర్థతతో పోషించి దానికి ప్రాణం పోశాడు. తెలుగుచిత్రాలలో ఇంత సమర్థమైన పాత్రనిర్వహణ లేదని చెప్పవచ్చు. తోటరాముడుగా ఎన్. టి. రామారావూ, సీనుగా రేలంగీ తమ పాత్రలను చాలా బాగా పోషించారు. తోటమాలి తల్లిగా సురభి కమలా, అంజిగా బాలకృష్ణా, సదాజపుడుగా పద్మనాభం బాగా రాణించారు. రాజూ రాణీ పాత్రలను ధరించిన సి. ఎస్. ఆర్. హేమలతమ్మారావుగార్లు సమర్థులైన నటులైఉండికూడా తగినంతగా రాణించలేదు.

కే. వి. రెడ్డిగారి డైరెక్షను నిర్దుష్టంగా, నిండుగా ఉన్నది గాని అందులో జీవమూ, స్ఫురణా తక్కువ. పాత్రలన్నీ రాణించక పోవటానికి ఇదొక కారణం కావచ్చు. మంచి దర్శకుడు స్థూలమైన సన్నివేశాల పట్ల చూపే శ్రద్ధే సూక్ష్మమైన కదలికల పైనా చూపి ప్రతిదృశ్యమూ, ప్రతిపాత్రా సజీవంగా, ఉండేటట్లు చేయాలి. ఈ విషయంలో అచ్చు డైరెక్షనేగాని పశ్చాత్కథకుడి సహాయంకూడా పుచ్చుకోవాలి. విజయావారి తొలిచిత్రం "షావుకారు" లో ఏ ఒక్కపాత్రా ప్రేక్షకులను తాకకుండా పోలేదు; నోరు విప్పి మాట్లాడిన ఏ ఒక్క పాత్రా వాతావరణంలో లీనమైపోలేదు, కాని "పాతాళభైరవి" లో ఇటువంటి పాత్రలున్నాయి. బాక్సాఫీసు కొలతబద్దకు ఇది అడ్డువస్తుందని కాదు. సినిమా కళాభిలాషులకు దీనివల్ల పరిపూర్ణ సంతృప్తి లేకుండాపోతుంది. అంతే.

ఘంటసాల సంగీతదర్శకత్వం బాగా ఉంది. ఘంటసాలా, లీలా కలిసి పాడిన పాటలు చిరకాలం ప్రేక్షకుల చెవులలో మోగుతాయి.

బార్ట్లీ ఫొటోగ్రఫీ మొత్తమ్మీద చాలా బాగుంది. కొన్నిచోట్ల చాలా భావగర్భితంగానూ, ఉదాత్తంగానూ ఉన్నది.

పారిశ్రామిక కళాదృష్టిలో "పాతాళభైరవి" ఒక అనుపమానమైన, ఆకర్షవంతమైన సృష్టి అని ఒప్పుకుతీరాలి.

"ప్రేక్షకుడు" ★

డైరీ

(5-వ పేజీ తరువాయి)

—హైదరాబాద్ రాజ్యంలో అసాఫియా సివిల్ ప్రొసీజర్ కోడ్, అసాఫియా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ల స్థానే నేటి నుంచి భారత ప్రభుత్వపు సివిల్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్లు అమలు జరుపబడుతున్నాయి.

—రాజస్థాన్, పంజాబ్ సంస్థానాలు, మధ్యభారత్, సౌరాష్ట్ర దేశాల సంస్థాన సైనికదళాలు భారతసైన్యంలోకి లీనం చెయ్యబడినవి.

సవరణ

గతవారం డైరీలో ఆదివారం, 1951 మార్చి 18 తారీఖులో, "ఆస్ట్రేలియాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి జరిగిన ఒక కుట్ర" కి బదులు "ఆగ్నేయ యాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి జరిగిన ఒక కుట్ర" అని చదువుకోవాలి.

★